క్లుప్తంగా

సాయిబాబాకు విశేష పూజలు



మనుబోలు: మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు బాబా విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. వేద వ్యాసు – జయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

⇨ పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ జరిగింది.

డ్రోన్ల తయారీ అభినందనీయం



డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న విద్యార్థులు

కొడవలూరు: విద్యార్థులు స్వయంగా డ్రోన్లను తయారు చేయడం అభినందనీయమని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ అన్నారు. నార్తురాజుపాళెంలోని కళాశాలలో ఈసీఈ నాలుగో సంవత్సర విద్యార్థులు తయారు చేసిన డ్రోన్‌లను కళాశాల ప్రాంగణంలో గురువారం ప్రయోగాత్మకంగా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీ డాక్ అనే శిక్షణా సంస్థ ద్వారా విద్యార్థులకు డ్రోన్‌లపై ప్రత్యేక శిక్షణ ఇప్పించడం వల్లే రాష్ట్రంలోనే తొలిసారిగా తమ కళాశాల విద్యార్థులు వీటిని తయారు చేయగలిగారన్నారు. వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, ఇన్నోవేషన్, డెవలప్‌మెంట్ డీన్ కృష్ణచైతన్య, ఏఓ గిరీష్‌కుమార్, సీ డాక్ ప్రతినిధులు హరిశ్చంద్ర, లిప్టీ, అమర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం తిప్ప గిరిజన కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో ఇంట్లోని వారు బయట ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని నగదు, సామగ్రి, దుస్తులు, గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న తిరువూరు అశోక్‌రెడ్డి అనే వ్యక్తి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు, పది కిలోల బియ్యం అందజేశారు.

ఆదుకోవాలని వినతి

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్యశాఖలో పని చేస్తూ గత నెలలో ప్రమాదవశాత్తు హెల్త్ అసిస్టెంట్ నక్కా రామ్‌కుమార్ మృతిచెందారని, వారి కుటుంబంలో ఒకరికి త్వరగా కారుణ్య నియామకం కల్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు మృతుడి భార్య, బిడ్డలతో కలిసి సుధాకర్‌రావు గురువారం సంతపేటలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత, ఏఓ నిశాంత్‌రెడ్డిలకు వినతి పత్రం ఇచ్చారు. ఆ కుటుంబానికి ప్రభుత్వపరంగా రావాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చూడటంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ

నెల్లూరు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దీనదయాళ్ ఉపాధ్యాయ–గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా సీడాప్, ట్రైడ్స్–ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని సంస్థ నేత కె.సునీల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పాత జెడ్పీ కార్యాలయ సమీపంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా సమయంలో హాస్టల్, భోజనం, యూనిఫామ్ కూడా ఉచితంగా కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఇండస్ట్రీయల్ సర్టిఫికెట్‌తోపాటు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత తమ సర్టిఫికెట్లతోపాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు కాపీలను కొత్తూరు రోడ్డులోని కేఎస్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ట్రైడ్స్–ఐటీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 98661 11223 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వామ్మో.. కుక్కలు

- గ్రామాల్లో విపరీతంగా గ్రామ సింహాలు
- అల్లాడుతున్న పిల్లలు
- సీహెచ్‌సీకు నెలకు 300 కేసులు
- చర్యలు తీసుకోవాలంటున్న జనం



విచ్చలవిడిగా తిరుగుతున్న గ్రామ సింహాలు



గాయపడిన బాలిక (ఫైల్)

పొదలకూరు: గ్రామాలు, పట్టణంలో గ్రామ సింహాలు గుంపులుగా చేరి ప్రజల్ని భయపెడుతున్నాయి. ఏమరుపాటుగా ఉంటే కాటు వేస్తున్నట్టు పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. పొద్దుపోయి ట్యూషన్ల నుంచి పిల్లలు ఇళ్లకు ఒంటరిగా వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పట్టణంలో ఓ బాలుడు సైకిల్‌పై వస్తుండగా కుక్క తరుముకుని కాలుపై కాటువేసింది. దీంతో వారు సీహెచ్‌సీకి వెళ్లి యాంటీ రాబిస్ ఇంజెక్షన్ వేయించుకుంటున్నారు. పొదలకూరు పట్టణంలో, మండలంలో ఏ వీధిలో చూసినా శునకాలు పదుల సంఖ్యలో ఉంటున్నాయి. గ్రామాల్లో కుక్కల వల్ల ముఖ్యంగా పిల్లలు భీతిల్లుతున్నారు. రోడ్లపై వెళ్లే ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు బాధితులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్టు ఆస్పత్రికి సిబ్బంది వెల్లడిస్తున్నారు. పంచాయతీ పాలకులు అనుమతి తీసుకుని కుక్కలను పట్టించి ఊరికి దూరంగా వదిలి పెట్టాల్సి ఉంది. అయితే అనుమతి తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది.

అధికంగా బాధితులు

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతినిత్యం కుక్కకాటు బాధితులు వస్తున్నారు. ఇటీవల ఒక్క రోజే పదిమంది వచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచి పరిశీలిస్తే నెలకు సుమారు 300 పైగా కుక్కకాటు కేసులు సీహెచ్‌సీకు వస్తున్నట్టు వైద్యులు వెల్లడించారు. అధిక సంఖ్యలో పిల్లల్నే శునకాలు కాటువేస్తున్నాయి. వీటిలో పిచ్చికుక్కలు ఉంటే ప్రమాదకరమంటున్నారు. పెంపుడు కుక్కల్ని సైతం బయటకు వదిలివేస్తుండటంతో స్వైర విహారం చేస్తున్నాయి.

సంఖ్య తగ్గించాలి

సాధారణంగా మున్సిపాలిటీ, పంచాయతీల పాలకులు కుక్కల సంఖ్యను తగ్గించాలంటే వాటి సంతానోత్పత్తి లేకుండా ఇంజెక్షన్లు వేయాల్సి ఉంటుంది. లేకుంటే కుక్కల్ని పట్టించి ఊరికి దూరంగా వదిలి పెట్టాలి. అయితే ఈ రెండు పనులను చేపట్టేందుకు పంచాయతీ పాలకులు చొరవ తీసుకోవడం లేదు. కుక్కలను పట్టించాలంటే జంతు ప్రేమికుల వల్ల న్యాయపరమైన చిక్కులు ఏర్పడతాయంటున్నారు. దీంతో వాటి సంఖ్యగా పెరిగిపోతోంది. శునకాలు ప్రతి ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో సంతానోత్పత్తిని పెంపొందించుకుంటాయి.



ఇటీవల ఓ వ్యక్తి కాలుపై కుక్కకాటు

ఏఆర్వీ అందుబాటులో ఉంది



“కుక్కకాటు బాధితులు వస్తున్నారు. సీహెచ్‌సీలో ఏఆర్వీ అందుబాటులో ఉంది. కాటు వేసిన వెంటనే నీటితో శుభ్రం చేస్తే చాలావరకు ప్రమాదం తగ్గుతుంది. తర్వాత ఆస్పత్రికి వచ్చి నిర్దేశించిన తేదీల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి. పిల్లలను పెద్దలు రాత్రివేళల్లో జాగ్రత్తగా ఇంటికి తీసుకువెళ్లాలి.

– డాక్టర్ యు.ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పొదలకూరు

మర్యాదపూర్వకంగా..



ప్రసన్నకుమార్‌రెడ్డికి మొక్క అందజేసిన నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపల్ విభాగం కార్యదర్శిగా బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మోర్ల భరత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా షబ్బీర్, శేషగిరి నియమితులైన క్రమంలో వారు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి మొక్క అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం రూరల్, టౌన్ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, షాహుల్, కౌన్సిలర్లు యానాదిరెడ్డి, ప్రమీలమ్మ, అనంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాగులపాడులో రజత్‌కుమార్‌రెడ్డి పర్యటన



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న రజత్‌కుమార్‌రెడ్డి

కోవూరు: వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మండలం, కాగులపాడు గ్రామంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరు గోపాల్‌రెడ్డి, పగడాల కృష్ణారెడ్డిని వారి నివాసంలో కలుసుకుని యోగక్షేమాల గురించి ఆరాతీశారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మండలాధ్యక్షుడు చెర్లో సతీష్‌రెడ్డి, వేణు, మహేష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల రద్దీ

- వసతుల కల్పనలో వక్ఫ్ బోర్డు విఫలం
- వర్షం కురవడంతో అవస్థలు



దర్గాలో భక్తులు

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కసుమూరు మస్తాన్‌వలీ దర్గా 248వ గంధ మహోత్సవాల నేపథ్యంలో గురువారం పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. తొలుత దర్గాను సందర్శించి, గంధ మహోత్సవం ప్రారంభమయ్యే చందన్‌మహల్‌కు చేరుకున్నారు. ఏర్పాట్లకు వక్ఫ్ బోర్డు రూ.16 లక్షలు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. దర్గాకు పెయింటింగ్, ప్రాంగణంతోపాటు పలుచోట్ల విద్యుద్దీపాలంకరణ, పారిశుద్ధ్య సమస్య లేకుండా చర్యలు చేపడతామని బోర్డు ఆర్భాటంగా ప్రచారం చేసింది. అధిక సంఖ్యలో భక్తులు గురువారం మధ్యాహ్నమే కసుమూరుకు చేరుకున్నారు. వర్షం కురవడంతో దర్గా, పరిసర ప్రాంతాలు, చందన్‌మహల్ ప్రాంగణమంతా బురదమయమైంది. దీంతో భక్తులు తిరిగేందుకు అవస్థలు పడ్డారు. మహల్ వద్ద షామియానాలు ఎక్కువ సంఖ్యలో వేయకపోడంతో బురద నేలపైనా కూర్చోవాల్సి వచ్చింది. అక్కడ విద్యుద్దీపాలంకరణ సక్రమంగా చేయకపోవడంతో ప్రాంగణమంతా చీకటిగా మారింది. మొబైల్ టాయిలెట్లు కూడా అవసరమైనన్ని లేకపోడంతో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు.



చందన్‌మహల్ వద్ద బురద నేలపైనే..



చందన్‌మహల్ వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయని విద్యుద్దీపాలంకరణ

ఐదేళ్లుగా అద్దె చెల్లించని షాపు సీజ్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థకు అద్దె చెల్లించని మున్సిపల్ దుకాణాన్ని రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. డైకస్‌రోడ్డులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్‌లో ఒకటో నంబర్ షాపునకు సంబంధించి సదరు యజమాని 2020 జనవరి నుంచి 2025 జూలై వరకు రూ.15,05,892 అద్దె చెల్లించాల్సి ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా ప్రయోజనం లేకపోవడంతో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు సదరు షాపును సీజ్ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ఉదయ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు నమోదు

విడవలూరు: బైక్ చోరీపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన ఆదిపూడి రమణయ్య అనే వ్యక్తి కొన్నినెలల క్రితం హీరో ప్యాషన్ ప్లస్ బైక్‌ను కొనుగోలు చేశాడు. గత నెల 28న రాత్రి ఆయన తన ఇంటి బయట బైక్‌ను పార్కింగ్ చేసి, కుటుంబసభ్యులతో కలిసి అదే గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు చూసేందుకు వెళ్లాడు. ఉత్సవాల ముగించుకుని రాత్రి 2:30 సమయంలో ఇంటికి చేరుకునే సరికి బైక్ కనిపించలేదు. దీంతో చుట్టూ పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పిడుగుపడి..

- రెండు గృహాల్లో కాలిపోయిన వస్తువులు
- ఓ వ్యక్తికి గాయాలు



ఇంట్లో కాలిపోయిన వస్తువులు

వెంకటాచలం: మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో గురువారం మధ్యాహ్నం రెండు నివాసాలపై పిడుగు పడింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామానికి చెందిన కురుగొండ కోటయ్య, కర్రియ్య ఇండ్లపై పిడుగుపడి, టీవీ, ఫ్రిడ్జ్ కాలిపోయాయి. రూ.80 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితులు వాపోయారు. అలాగే వెంకటేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి.

అంధకారంలో తిక్కవరప్పాడు

వర్షం వల్ల ఇస్కపాళెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రానికి సర్వేపల్లి, ఇస్కపాళెం గ్రామాల్లో సిబ్బంది పనులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. అయితే తిక్కవరప్పాడులో సరఫరా నిలిచిపోవడంపై ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ సిబ్బంది గ్రామానికి రాకపోవడంతో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సరఫరా లేక ప్రజల అవస్థలు పడ్డారు.

కొనసాగుతున్న పెన్‌డౌన్



సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న దస్తావేజు లేఖరులు

కోవూరు: కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖరులు నాలుగో రోజు గురువారం పెన్‌డౌన్ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోవూరు సబ్ రిజిస్ట్రార్ పులి పెంచలయ్యకు వినతి పత్రం అందించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరులు రాము, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సునీల్, బాబు, చంద్రయ్య, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

వెంకటాచలం: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈనెల 21 నుంచి 23 తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్ – 19 ఫుట్‌బాల్ పోటీలకు గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న పి.పూజ, జి.రాధిక, ఆర్.శ్రీపవిత్ర, 9వ తరగతి చదువుతున్న టి.చరిత, ఆర్.దీపక, పి.భవాని, టి.చిట్టెమ్మ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారిని గురువారం ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, పీడీ షేక్ షబిక, ఉపాధ్యాయులు అభినందించారు.

భూసార పరీక్షలపై విద్యార్థినులకు శిక్షణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రామచంద్రాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు భూసార పరీక్షలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఏడీఏ దేవసేన పలు విషయాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల గురించి తెలుసుకోవడం ద్వారా ఏ పంట వేయాలి?, ఏ పంట వేయకూడదు? అనే అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థి దశలో వీటిపై అవగాహన కలిగి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త అనూష, నెల్లూరు భూసార పరీక్షల కేంద్రం అధికారి కల్యాణి, ఉపాధ్యాయిని శ్రీలక్ష్మి, వీఏఓ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

పాటూరులో వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం



మాట్లాడుతున్న అనూప్‌రెడ్డి

కోవూరు: మండలంలోని పాటూరులో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సమావేశం గురువారం జరిగింది. పార్టీ మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా, ఎవరికి అన్యాయం జరిగినా అందరం ఒకే కుటుంబంలా సమష్టిగా ఎదుర్కొందామన్నారు. నాయకులు మధురెడ్డి, ఆదినారాయణరెడ్డి, విజయసేనారెడ్డి, సుబ్బరాయుడు, కవరగిరి ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మురళి, సుధాకర్‌రెడ్డి, అబ్బాయరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, నితీష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం



మనుబోలులో పోటీల ప్రారంభం



టీపీగూడూరు : ఎంపికైన క్రీడాకారులతో అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు

మనుబోలు: మండలంలోని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 69వ స్కూల్ గేమ్స్‌ను గురువారం ఎంఈఓ జె.ఓబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ చూపితే జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లొచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 రమేష్‌కుమార్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ మంజువాణి, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

⇨ తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అండర్ – 14, 17 సంవత్సరాల కేటగిరీలో బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంపికలకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు విచ్చేశారు. మండల విద్యాశాఖాధికారి వేణుగోపాలరెడ్డి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొడవలూరు: నార్తురాజుపాళెం హైస్కూల్లో..

క్రీడా జట్ల ఎంపిక

కొడవలూరు: నార్తురాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో ఎస్జీఎఫ్ మండల స్థాయి అథ్లెటిక్స్, చదరంగం, యోగా జట్లను గురువారం ఎంపిక చేశారు. ఎంఈఓ ఎస్.అంకయ్య పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. హెచ్‌ఎం డి.ఓబులేసు, పీఈటీ బి.ప్రవీణ్, ఐ.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు పెరటికోళ్ల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వెలుగు కార్యాలయంలో..

మనుబోలు: స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం పొదుపు మహిళలకు పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ మండలానికి 140 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

⇨ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం శ్రీధర్ పొదుపు సభ్యులకు గురువారం పెరటికోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లను పెంచడం ద్వారా గుడ్లు కొనుగోలు చేసే అవసరం ఉండదని, రోజూ గుడ్లు తినడం వల్ల ఆరోగ్యపరంగా బలంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



కొడవలూరు: మాట్లాడుతున్న వైద్యాధికారులు

కొడవలూరు: స్వస్థ్ నారి–సశక్తి పరివార్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు కోరారు. మండలంలోని కమ్మపాళెంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుందని, తద్వారా సమాజం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సోమశేఖర్, హెచ్‌ఎస్ రామ్మోహన్, హెచ్‌ఏ ఓ.సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీలు పద్మజ, రేష్మ, సుష్మ, ఏఎన్‌ఎంలు రాధమ్మ, దీనమ్మ, రాధిక పాల్గొన్నారు.

⇨ పొదలకూరు: మండలంలోని విరువూరు గ్రామంలో మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరాన్ని గురువారం నిర్వహించారు. డాక్టర్లు స్రవంతి, వినోద్ వైద్య పరీక్షలు చేసిన ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ జగన్, ఎంఎల్‌పీహెచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

⇨ మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ గేయపూజిత మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేది వరకూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య, హెల్త్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..



మనుబోలు: వైద్య పరీక్షలు చేస్తున్న పూజిత